లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

కీసర: లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని కీసర ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 13వ తేదీ వరకు కుషాయిగూడలోని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కోర్టులో లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో రాజీ మార్గం ఉన్న క్రిమినల్, అన్ని సివిల్ కేసులకు పరిష్కారం లభిస్తుందన్నారు.

వెంకటేశ్వరనగర్‌లో రక్తదాన శిబిరం



వెంకటేశ్వరనగర్‌లో రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న కమిషనర్ భాస్కర్‌రెడ్డి

కీసర: వంద రోజుల కార్యాచరణలో భాగంగా నాగారం మున్సిపాలిటీ పరిధిలోని వెంకటేశ్వర నగర్ బస్తీ దవాఖాన వద్ద వివేకానంద బ్లడ్ బ్యాంక్ సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ భాస్కర్‌రెడ్డి హాజరై శిబిరాన్ని ప్రారంభించి రక్తదానం చేశారు. అదేవిధంగా సుమారు 52 మంది స్థానిక ప్రజలు, కార్యాలయం సిబ్బంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారి నాగేశ్వర్‌రావు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

వరద సమస్యపై అధికారుల ఆరా

అల్వాల్: కౌకూర్ ఫార్చ్యూన్ ఎవెన్యూలో వర్షాకాలంలో వచ్చే వరదనీరు కాలనీ ప్రహరీ వద్ద నిలిచిపోవడంతో బయటకు వెళ్లే మార్గం లేకుండాపోతోంది. దీంతో వరద ఇళ్లలోకి వచ్చి చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యను స్థానిక కాంగ్రెస్ సీనియర్ నేత మల్లికార్జున్ మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్పందించి జీహెచ్‌ఎంసీ అధికారులతో చర్చించారు. గురువారం జీహెచ్‌ఎంసీ డీఈ రఘు కాలనీవాసులతో కలిసి పర్యటించారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాలనీవాసులు సయ్యద్ అస్లాం, ఖాదర్ హుస్సేన్, గౌతమ్‌రాయ్, రాజ్‌కిరణ్, అబ్దుల్‌సలాం, మన్మధన్‌నాయక్, సీతారాం, భాస్కర్, రామారావు, ప్రమోద్, శేషాద్రి, నారాయణరెడ్డి, సోమోజీ, శశిధర్, నరేంద్ర, శ్రీనివాస్‌రెడ్డి, మురళి పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించండి

మౌలాలి: డివిజన్ పరిధిలోని షఫీనగర్, జేబీఆర్ స్కూల్ మార్గం సంతోషిమానగర్, డీమార్ట్ ఎదురు మార్గాల్లో రోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని కార్పొరేటర్ గున్నాల సునీత గురువారం జోనల్ కమిషనర్ రవికిరణ్‌కు వినతిపత్రం అందజేశారు. ఆమె మాట్లాడుతూ.. మూడేళ్లుగా రోడ్లు అధ్వానంగా ఉన్నాయన్నారు. నిధుల మంజూరుకు జెడ్సీ సానుకూలంగా స్పందించారని తెలిపారు.

బీజేపీలో పలువురి చేరిక

అల్వాల్: ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాంచంద్రరావు అన్నారు. గురువారం అల్వాల్‌కు చెందిన లోక్‌సత్తా పార్టీ సీనియర్ నాయకులు కె.శ్రీనివాస్‌వర్మ, తన అనుచరులతో కలిసి బీజేపీలో చేరగా.. ఆ పార్టీ అధ్యక్షుడు కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలో దేశం ఎంతో అభివృద్ధి చెందుతుందని, రాష్ట్రంలో బీజేపీ బలోపేతానికి చేరికలను ప్రోత్సహించాలన్నారు. పవన్‌కుమార్, రవికుమార్, ప్రదీప్‌మీనన్, శ్రీకాంత్‌రెడ్డి, ఉషా, అంజలి, స్వాతి, కృష్ణకుమారి, సంతోషి, వేణుగోపాల్‌రెడ్డి, చందిల్, వరకుమార్, గిరిధర్ వర్మ, ప్రజీత్, శేఖర్, రాజేష్, ప్రశాంత్, కిరణ్ కుమార్, రవికుమార్, మహేష్, రెహ్మత్ తదితరులున్నారు.

అభివృద్ధికి అందనంత దూరంలో జవహర్‌నగర్

పేదల ఆవాసం.. సమస్యల సావాసం

పేరుకే పెద్ద కార్పొరేషన్.. అభివృద్ధి అంతంతే..

- ఇరుకు రోడ్లు, వెలగని వీధిలైట్లు, చెత్తకుప్పలు..
- కుక్కల స్వైరవిహారం.. దోమల దండయాత్ర
- రోగాలతో ఆస్పత్రుల చుట్టూ నిత్యం చక్కర్లు
- అవస్థలు పడుతున్న జవహర్‌నగర్‌వాసులు



జవహర్‌నగర్‌లో ఇళ్ల నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని నిరసన చేస్తున్న ప్రజలు(ఫైల్)

జవహర్‌నగర్ దగ్గరకు రాగానే ఎవరైనా ముక్కు మూసుకోవాల్సిందే.. ఈ ప్రాంతంలోని చెత్తతో సతమతం కావాల్సిందే.. స్వచ్ఛమైన తాగునీరు దొరక్క తప్పని ఇబ్బందులు.. గుంతలమయంగా మారిన రోడ్లతో వాహనదారులకు నరకం.. ఎక్కడికక్కడ పేరుకుపోతున్న వ్యర్థాలతో తిప్పలు.. గుంపులుగా స్వైరవిహారం చేస్తున్న కుక్కలు.. రాత్రయితే గుంపులుగా దాడి చేస్తున్న దోమలు.. వ్యర్థాలతో నిండిన మురుగు కాల్వలు.. ఇలా ఒకటీ మిటి దాదాపు రెండు లక్షల జనాభా ఉన్న ఈ ప్రాంతంలో సవాలక్ష సమస్యలు రాజ్యమేలుతున్నాయి. దీంతో ఈ ప్రాంతంలోని ప్రజలు నిత్యం ఆస్పత్రుల చుట్టూ తిరగాల్సిన దుస్థితి ఎదురవుతోంది. సంపాదించిన డబ్బులు మొత్తం ఆస్పత్రులకే సమర్పించాల్సిన స్థితి ఎదురవుతోంది. ఈ ప్రాంతంలోని యువకులకు పిల్లనిచ్చేందుకు కూడా చాలామంది వెనకడుగు వేస్తున్నారంటే జవహర్‌నగర్ కార్పొరేషన్ గురించి అర్థం చేసుకోవచ్చు.

– జవహర్‌నగర్



జవహర్‌నగర్ వ్యూ



జవహర్‌నగర్‌లో రోడ్ల మధ్యలో మురుగు, చెత్తాచెదారం



జవహర్‌నగర్ డంపింగ్‌యార్డ్‌తో కలుషితమైన నీరు

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోనే మేజర్ కార్పొరేషన్‌గా పేరొందిన జవహర్‌నగర్ అభివృద్ధిలో మాత్రం అందనంత దూరంలో ఉంది. లక్ష జనాభా ఉన్న జవహర్‌నగర్ కార్పొరేషన్ సవాలక్ష సమస్యలతో సతమతమవుతోంది. ఈ పట్టణంలో ఎక్కువ శాతం నిరుపేదలే నివాసం ఉంటున్నారు. ఇక్కడి కాలనీలకు అది చేస్తాం.. ఇది చేస్తామంటూ ఎన్నికల సమయంలో హామీలు కురిపించిన నాయకులు ఇటువైపు కన్నెత్తి చూసిన పాపానపోవడం లేదు. హామీలు మాత్రం మాయమాటలుగానే మిగిలిపోయాయి. జవహర్‌నగర్‌లో ఇతర ప్రాంతాల నుంచి వలస వచ్చిన వారే అధికంగా ఇక్కడ నివాసం ఉంటున్నారు. గ్రేటర్ హైదరాబాద్‌కు ఈ ప్రాంతం సమీపంలోనే ఉండటంతో నగరంలో పనిచేసే చాలా మంది వ్యాపారులు, ఉద్యోగులు ఇక్కడే నివాసం ఏర్పాటు చేసుకుని రాకపోకలు సాగిస్తుంటారు.

ప్రజాప్రతినిధుల పనితీరుతో తిప్పలు

20 ఏళ్ల క్రితం రెండు వేల మంది జనాభా ఉన్న ఈ ప్రాంతం ప్రస్తుతం 50వేల ఇళ్లు, 120 కాలనీలతో రెండు లక్షలకుపైగా జనాభా నివసిస్తున్నారు. జవహర్‌నగర్ మొత్తం 6 వేల ఎకరాల విస్తీర్ణం కలిగి ఉంది. ప్రజాప్రతినిధుల పనితీరు అధికారుల వైఫల్యంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జవహర్‌నగర్ జనాభా ప్రతి సంవత్సరం పెరుగుతూనే ఉంది. అయితే అందుకు అనుగుణంగా సరిపడా వనరులు సమకూర్చుకోవడంలో కార్పొరేషన్ అధికారులు విఫలమవుతున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. 2004లో పంచాయతీ నిధులు దుర్వినియోగం అయ్యాయనే అభియోగం రావడంతో ప్రజలు వద్ద ఎటువంటి పన్నుల వసూలు చేయవద్దని అప్పటి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో కొన్నేళ్లుగా అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత గ్రామకంఠంలోని(335 ఎకరాల) 8వేల ఇళ్లకు మాత్రమే ఇంటి పన్నులు తీసుకున్నారు. ఇంకా 30 వేల ఇళ్లకు పైగా ఇంటి పన్నులు తీసుకోవాల్సి ఉన్నా తీసుకోలేదు. ఆ తర్వాత ప్రజల పోరాటాలతో ప్రభుత్వం అన్ని కాలనీలలో ఇంటి పన్నులు తీసుకోవడం ప్రారంభించారు. జవహర్‌నగర్ పాలకవర్గం పదవీ కాలం ముగియడంతో ప్రస్తుతం ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది.

కొత్త ఇళ్లు నిర్మించుకుంటే కూల్చివేతలు..

ఏళ్ల తరబడి ఇంటి పన్నులు కట్టినా ఆ యజమానులకు మాత్రం కొత్త ఇంటిని నిర్మించుకోవడానికి ప్రభుత్వం అనుమతులు ఇవ్వకపోవడంతో చాలా మంది ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా కొంత మంది ఇళ్లలోకి నీరు చేరి శిథిలావస్థకు చేరుకున్నాయి. వాటి స్థానంలో కొత్త ఇంటిని నిర్మించుకోవాలన్నా అనుమతులు లేకపోవడంతో కూలిపోతున్న ఇళ్లలోనే బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు. కొందరు ధైర్యం చేసి కొత్తగా ఇళ్లను నిర్మించుకుంటే అధికారులు వాటిని నేలమట్టం చేయిస్తున్నారు. దీంతో పేదలు ఈ విషయంలో ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి నూతన ఇంటిని నిర్మించుకునేవారికి కార్పొరేషన్ అధికారులు అనుమతి ఇవ్వాలని పెద్ద ఎత్తున డిమాండ్ చేస్తున్నారు. దాంతో పాటు డ్రైనేజీలో వ్యర్థాలు, గుంతమయంగా మారిన రోడ్లు, వెలగని వీధిలైట్లు తదితర సమస్యలను పరిష్కరించడంతో పాటు తాగునీటి సౌకర్యం కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. డంపింగ్ యార్డు నుంచి దుర్వాసన వెదజల్లకుండా చర్యలు చేపట్టడంతో పాటు కార్పొరేషన్ సిబ్బందితో బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని చెబుతున్నారు.



జవహర్‌నగర్‌లో అంతర్గత రోడ్ల దుస్థితి

ఇళ్లకు అనుమతులు ఇవ్వాలి



పేరుకే ప్రజా ప్రభుత్వం. జవహర్‌నగర్‌లో ఇంటి నిర్మాణాలకు అనుమతులు మాత్రం ఇవ్వడంలేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 10 ఏళ్లు బీఆర్‌ఎస్ ప్రభుత్వం పాలించినా ప్రజలను ఏమాత్రం పట్టించుకోలేదు. ప్రస్తుతం ప్రజా ప్రభుత్వంలో పేదలు ఇళ్లు నిర్మించుకోవాలంటే భయాందోళనకు గురవుతున్నారు. నివాస స్థలాలు ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం ఇంటి అనుమతులు ఇవ్వాలి.

– కర్లపుడి జ్యోగారావు, బీజేపీ జవహర్‌నగర్ ఈస్ట్ అధ్యక్షుడు

సీఎం రేవంత్‌రెడ్డికి వివరిస్తాం..



గత ప్రభుత్వ వైఫల్యం కారణంగా జవహర్‌నగర్‌లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఎంతోమంది ఇక్కడ నివాసం ఉంటున్నారు. వారికి ప్రజా ప్రభుత్వం అండగా ఉంటుంది. 10 ఏళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ఇంటి అనుమతులు లేకుండా ఇబ్బందులు పడ్డారు. ఈ విషయంపై ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డికి వివరించాం. త్వరలో ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు వచ్చేలా ప్రయత్నిస్తాం.

– మల్లిపూల శ్రీకాంత్‌యాదవ్, కాంగ్రెస్ జవహర్‌నగర్ అధ్యక్షుడు

దశలవారీగా అభివృద్ధి చేస్తాం



పట్టణంలో సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తాం. కార్పొరేషన్ పెద్దది కావడంతో సమస్య అధికమవుతోంది. ప్రభుత్వం నుంచి మరిన్ని నిధులు తీసుకువచ్చి ఇక్కడి సమస్యలను పరిష్కరిస్తాం. ఇప్పటి వరకు జవహర్‌నగర్‌లో నూతన నిర్మాణాలకు ఎలాంటి అనుమతులు ఇవ్వడంలేదు. ఈ విషయంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారం కోసం ప్రయత్నిస్తాం.

– వసంత, జవహర్‌నగర్ కమిషనర్

కృత్రిమ మేధతో అన్ని రంగాల్లో పురోగతి



మాట్లాడుతున్న ఐఐటీ పాట్నా ప్రొఫెసర్ డా.రాజీవ్ మిశ్ర

పోచారం: అన్ని రంగాలలో కృత్రిమ మేధ(ఏఐ) విస్తరించి, పురోగతిలో ప్రత్యేక పాత్రను పోషిస్తోందని ఐఐటీ పాట్నా ప్రొఫెసర్ డా.రాజీవ్ మిశ్ర అన్నారు. యంనంపేట్‌లోని శ్రీనిధి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో భారత ప్రభుత్వ రంగ సంస్థ అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'కృత్రిమ మేధ వినియోగంతో రాబోయే తరంలో సాంకేతికతలు' అనే అంశంపై గురువారం జాతీయ సదస్సు ప్రారంభించారు. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజీవ్ మిశ్ర మాట్లాడుతూ.. ఏఐ అనేది ఒక ఏజెన్సీగా మారిందని, దీని సహాయంతో అన్ని రంగాలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. మానవ విలువలకు భంగం కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటూ ఏఐని వినియోగించుకోవాలని సూచించారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న ఎన్ఐటీ సిల్‌చార్ ప్రొ.డా.సరోజ్ కుమార్ బిస్వాస్ మాట్లాడుతూ.. యుక్త వయస్సులోనే విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆల్‌టెక్ పవర్ అండ్ ఎనర్జీ సిస్టమ్స్ సీఈఓ డా.కుమార్ ఈశ్వరన్, స్నిస్ట్ ప్రిన్సిపాల్ డా.శివారెడ్డి, పరిశోధనా విభాగం సలహాదారు డా.సంజీవరావు, డీన్ డా.అలీ హుస్సేన్, సీఎస్ఈ హెచ్‌ఓడీ డా.కే.శిరీష, కన్వీనర్లు డా.అరుణ వారణాసి, డా.తాళకోటి మమత తదితరులు పాల్గొన్నారు.

వాహనాల రాకపోకలు సాఫీగా సాగేలా..

సాక్షి ఎఫెక్ట్..

మేడ్చల్: పనులు పూర్తయ్యేదెన్నడో శీర్షికతో సాక్షి దినపత్రిక బుధవారం ప్రచురించిన కథనంపై మేడ్చల్ మున్సిపల్ అధికారులు స్పందించారు. హౌసింగ్ బోర్డు నుంచి గ్రంథాలయం వరకు అసంపూర్తి రోడ్డు ఉండటంతో మున్సిపల్ అధికారులు గురువారం జేసీబీ సహాయంతో చదును చేయించి వాహనాల రాకపోకలు సాగే విధంగా తయారు చేశారు. త్వరలోనే రోడ్డు నిర్మాణం చేపడతామని అధికారులు తెలిపారు.



హౌసింగ్ బోర్డు రోడ్డును చదును చేస్తూ..

భర్తకు వీడియో కాల్ చేసి ఆత్మహత్య

మేడ్చల్: సంతానం కలగడం లేదనే మనస్థాపంతో ఓ మహిళ తన భర్తకు వీడియో కాల్ చేసి ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మెదక్ జిల్లా నిజాంపేట్ మండలం తిప్పలగూడకు చెందిన వినయ్, రవళి(24)కి మూడు సంవత్సరాల క్రితం వివాహం అయ్యింది. జీవనోపాధి కోసం వీరు కొన్ని నెలల క్రితం మేడ్చల్‌కు వచ్చి కింది బస్తీలో నివాసం ఉంటున్నారు. వివాహం జరిగి మూడేళ్లు గడిచినా సంతానం కలగకపోవడంతో రవళి తీవ్ర మనస్థాపానికి గురైంది. గురువారం సాయంత్రం భర్త వినయ్ బయటకు వెళ్లడంతో ఆయనకు వీడియో కాల్ చేసి ఆత్మహత్య చేసుకుంటున్నానని చెప్పి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. ఫోన్‌లో చూసిన భర్త వినయ్ వెంటనే ఇంటికి వచ్చాడు. అప్పటికే ఆమె మృతి చెందింది. విషయం తెలుసుకున్న మేడ్చల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. భర్త వినయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తెలిపారు.

రావల్‌కోల్ పరిధిలో ఓ వ్యక్తి ..

మేడ్చల్: మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రావల్‌కోల్ పరిధిలో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం .. రావల్‌కోల్‌లో నివాసం ఉండే హితని(40) ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసుకున్న మేడ్చల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాల కూల్చివేత



అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న సిబ్బంది

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని కాచవానిసింగారంలో అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో సిబ్బంది కూల్చివేశారు. కొందరు వ్యక్తులు ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో కూల్చివేత చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ డీఎస్ రజిని మాట్లాడుతూ.. ప్రభుత్వ స్థలాల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పునర్నిర్మాణాలు చేపడితే క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని హెచ్చరించారు. మున్సిపల్ కమిషనర్ నిత్యానంద్, ఆర్ఐ సాయిరాజ్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలను స్వచ్ఛందంగా తొలగించాలి

మేడ్చల్: మేడ్చల్ పట్టణంలో ఫుట్‌పాత్‌లపై ఏర్పాటు చేసుకున్న వ్యాపారాలను యజమానులు స్వచ్ఛందంగా తొలగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ చంద్రప్రకాష్‌రెడ్డి కోరారు. ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలతో పాదచారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు చట్టప్రకారం చర్యలు తీసుకోకముందే వ్యాపారులు అనుమతి లేని వ్యాపారాలను తొలగించాలని కోరారు. ఆటోలలో సంచార విక్రయాలు చేసే వారు ప్రజారవాణాకు ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని అన్నారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తూ వ్యాపారాలు చేస్తే మున్సిపల్ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అక్రమ నిర్మాణాలను తొలగించాలని ఫిర్యాదు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మునీరాబాద్‌లో అక్రమ నిర్మాణాన్ని తొలగించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని మాజీ కౌన్సిలర్ లక్కిరెడ్డి శ్రీలతశ్రీనివాస్‌రెడ్డి గురువారం మేడ్చల్ జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. మునీరాబాద్ 2వ వార్డు పరిధిలో పూడూర్ గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 439/2, 440, 441, 442లలోని స్థలంలో ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా, ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతూ కమర్షియల్ షెడ్ల నిర్మాణం కొనసాగుతోందని, వెంటనే మున్సిపల్, జిల్లా అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలను తొలగించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

నాలుగో ఫేజ్‌లో రైతులందరికీ రుణమాఫీ



నిరాహార దీక్షలో ఉన్న రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారులు

ఘట్‌కేసర్: రైతు రుణమాఫీ సాధన సమితి ఆధ్వర్యంలో స్థానిక రైతు సేవా సహకార సంఘంలో రుణం తీసుకున్న 1200 మంది అన్నదాతల పంట రుణం మాఫీ చేయాలని చేపట్టిన నిరాహార దీక్షను జిల్లా వ్యవసాయాధికారి చంద్రకళ, ఏడీఏ వెంకటర్‌రాంరెడ్డి, మండల వ్యవసాయ అధికారి లావణ్యతో కలిసి గురువారం సందర్శించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా స్థానిక రైతు సేవా సహకార సంఘం ఆడిట్ పూర్తయ్యిందని, ప్రభుత్వం నిధులు విడుదల చేస్తే నాలుగో ఫేజ్‌లో ఉన్న ఘట్‌కేసర్ సంఘం రైతులందరికీ రుణమాఫీ అవుతుందని వ్యవసాయ అధికారులు హామీ ఇచ్చారు. కొండల్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, రమేష్, ఐలయ్యయాదవ్, ధర్మారెడ్డి దీక్ష చేపట్టగా శోభారాణి, లక్ష్మారెడ్డి, పోచిరెడ్డి, కృష్ణారెడ్డి, ధర్మారెడ్డి, మల్లేష్ ముదిరాజ్, మహిపాల్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, భిక్షపతిగౌడ్, మశ్చేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సమస్యల తిష్ట

కేఎల్‌ఆర్ కాలనీలో అడుగడుగునా సమస్యలే..

- అస్తవ్యస్తంగా రోడ్లు, డ్రైనేజీలు
- పదివేల జనాభాకు సౌకర్యాలు కరువు
- పట్టించుకోని సంబంధిత అధికారులు






రోడ్లపై పారుతున్న మురుగు

మేడ్చల్: పదేళ్ల క్రితం మేడ్చల్ పట్టణ దశ దిశ మార్చిన మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి చేసిన కేఎల్‌ఆర్ వెంచర్ ప్రస్తుతం సమస్యలకు నిలయంగా మారింది. కేఎల్‌ఆర్ విజయానగర్ పేరుతో దాదాపు వంద ఎకరాల్లో ఫేజ్–1, ఫేజ్–2, ఫేజ్–3, ఫేజ్–4 పేరుతో భారీ వెంచర్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో పెద్దసంఖ్యలో ప్రజలు ఇళ్లు కట్టుకుని నివాసం ఉంటున్నారు. పట్టణంలో లక్ష వరకు జనాభా ఉంటే కేఎల్‌ఆర్ కాలనీల్లోనే దాదాపు 10వేల మంది నివాసం ఉంటున్నారు. అధునాతన కాలనీలు, హెచ్‌ఎండీఏ వెంచర్ అయినా మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడంతో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. డ్రైనేజీ, గుంతలు పడిన రోడ్లు, పారిశుద్ధ్య సమస్య, వీధి దీపాలు వెలగకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. దోమల బెడద, కుక్కల స్వైర విహారంతో ప్రజలు నరకం అనుభవిస్తున్నారు.

అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ

15 ఏళ్ల క్రితం మేడ్చల్ పట్టణంలో మాజీ ఎమ్మెల్యే కేఎల్‌ఆర్ దశలవారిగా నాలుగు ఫేజ్‌లతో హెచ్‌ఎండీఏ అనుమతి, అన్ని వసతులతో వెంచర్ ఏర్పాటు చేశారు. అప్పటి డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. ఎక్కడపడితే అక్కడ పైప్‌లైన్లు పగలడంతో మురుగు ఏరులా పారుతోంది. ఆ సమయంలో వేసిన బీటీ రోడ్లు అస్తవ్యస్తంగా మారి గుంతలమయంగా మారాయి. కుక్కలు, పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. సాయంత్రం అయితే చాలు దోమలు గుంపులుగా దాడి చేస్తున్నాయి.

ఎన్నో సమస్యలు



కేఎల్‌ఆర్ వెంచర్‌లో ఎన్నో సమస్యలు ఉన్నాయి. గుంతల రోడ్లు, పొంగి పారుతున్న డ్రైనేజీ, వెలగని వీధి దీపాలు ఇలా అన్నీ సమస్యలే.. మున్సిపల్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి సమస్యలను పరిష్కరించాలి. నాయకులు స్పందించాలి.

– నాగరాజు